# ఆదిలోనే హంసపాదు

అప్పటికే అతనికి పెళ్ళి వయస్సు మళ్ళిపోయింది. పెళ్ళి చేసుకోవాలనే ఇచ్ఛ కూడా అడుగంటిపోయింది. పదహారోయేట నుంచీ అతణ్ణి పెళ్ళి సమస్య ఎదుర్కొంటూ వచ్చింది. అప్పటికి ఇంటరు చదువుతున్నాడు. నాయనమ్మ మంచం పట్టింది. 'ఎప్పుడు నాప్రాణంకాస్తా హరీమంటుందో తెలియదు...నువ్వొక ఇంటివాడివైతే ఆ ముచ్చట కూడా చూసి చచ్చిపోతాను నాయనా' అనేది నాయనమ్మ మంచంమీద పడుకుని మూలుగుతూ. అతను నవ్వుతూ 'నువ్వు చచ్చిపోతావనే భయం వల్లనే నేను పెళ్ళి చేసుకో దలుచుకోలేదు నాయనమ్మా' అనేవాడు. అతని కుర్రతనపు మాటలకి నవ్వాలో ఏడవాలో అర్థం కాకుండానే ఆవిడ అతణ్ణి విడిచి పెట్టి పోయింది.

ఆ రోజునుంచీ అతనికా ప్రసక్తి తెచ్చేందు కెవరూలేరు. తల్లితండ్రుల కతను పెద్ద కొడుకు. అతని తరవాత ఇంకా నలుగురు పిల్లలున్నారు. తండ్రికి నెలకి రెండొందలొస్తాయి. వెనక ఆస్తిపాస్తు ఏమీ లేవు. పెద్ద కొడుకు ఎప్పుడు అక్కరకొస్తాడా అని తల్లితండ్రులు ఆతృతపడటం సహజం.

అంత మాత్రాన ఏదో ఒక రూపంలో ఏదో ఒక సందర్భంలో, అతనిలో ఆ సమస్య రేకెత్తలేదనడం నిజానికి దూరం. అతని సహాధ్యాయిని ఒకమ్మాయి ఉండేది. ఆ అమ్మాయి, మామూలుగా చూస్తే పెద్ద అందమైన మనిషిలా కనిపించదు. అయితేనేం, ఒక్కొక్కళ్ళకి ఆకళ్ళలో ఎవరికీ గోచరించని ఏదో కాంతి తళుక్కుమన్నట్లు స్ఫురించేది. అలాగే అతనికీ ఆ అమ్మాయిలో ఏదో మహత్తర శక్తి అంతర్భూతమై ఉన్నట్లు తోచేది. ఆ అమ్మాయిని చూడాలనీ, చూస్తూ చూస్తూ అలా ఎంత సేపయినా ఉండిపోవాలనీ అనిపించేదతనికి. అలా అనుకున్న తక్షణం 'నీ ఆలోచనలన్నీ పాపభూయిష్టం సుమా' అని ఎవరో హెచ్చరించినట్లయేది. ఒకపరాయి ఆడపిల్లను చూసి, ఆ విధంగా ఆలోచించినందుకు తన్నుతాను ఎంతైనా నిందించుకునేవాడు. మూడు రోజులదాకా అసలు ఆలోచించడమే మానేసేవాడు. మళ్ళీ యథాప్రకారం. ఆ అమ్మాయి ఒక్కరోజు కాలేజికి రాకపోతే ఆ రోజున ఏమిటో మరి, అతనికి మతిపోయినట్లయి, పాఠాలు విన బుద్ధేసేది కాదు....ఇంటికిపోతే అన్నం సయించేది కాదు... నిద్రపట్టేది కాదు...మళ్ళీ తనలో తాను వితర్కించుకునే వాడు.... 'ఏమిటిది, నా మనస్సు ఇలా తప్పుదోవని పడిపోతోందేమిటి? అయినా ఆ పిల్ల గురించి ఆలోచించవలసిన అవసరం ఏముంది? ఆ అమ్మాయితో మాట్లాడితే నా కొరిగే స్వర్గం ఏమిటి....' అని మనస్సుకి బుద్ధి చెప్పుకుని వారం రోజులపాటు ఏ ఆడపిల్ల వంకా చూసే వాడుకాదు. కొన్నాళ్ళు పోయాక ఆ అమ్మాయికి పెళ్ళయినట్లు తెలిసింది. అప్పటి నుంచీ అతనికా ఆలోచనే రాలేదు. ఆ తరవాత కూడా కొన్నాళ్ళపాటు చదివింది ఆ అమ్మాయి. అయితే, ఆ అమ్మాయి కాలేజికి వచ్చిందో, పాఠం వింటోందో, లేదో అతనెప్పుడూ పరిశీలించలేదు.

అతను రోడ్డుమీద నడుస్తూండగా, బాగా పుష్టిగా ఉన్న అమ్మాయి అలా వెడుతూంటే, ఆ అమ్మాయిని చూడగానే 'ఆడదంటే అలాఉండాలి' అనుకునేవాడు చటుక్కున. మరుక్షణంలో అతనికి జ్ఞానోదయం కలిగేది. మనస్సులోనే చెంపలు వాయించుకునేవాడు. ఇక వంచిన తల ఎత్తకుండా ఎదురుగుండా ఎవరొస్తున్నారో చూసుకోకుండానే, తన దారిని తను పోయేవాడు.

ఒక్కొక్కమ్మాయి పరిచయంతో, అతనికి పెళ్లి చేసుకోవాలని బుద్ధి పుట్టేది. అయినా, తొందరపడి ఏ పనీ చేసేరకం కాదతను. తనలో తాను మాట్లాడుకోవడం, వితర్కించుకోవడం అతనికి అలవాటు (అందరూ వినాలనే ఉద్దేశంతో కాదు). పెళ్ళి చేసుకుంటే వచ్చే సుఖదుఃఖాలు తలుచుకుంటే సంసారం ఒక మహాసాగరం లాగునే కనిపించేదతని మనోనేత్రాలకి. "స్త్రీ సంపర్కం కోసమే అయితే పెళ్లి చేసుకోవాలనే సిద్ధాంతం ఎక్కడుంది?" అనుకునేవాడు. కొన్నికొన్ని సమయాల్లో అతని శరీరం స్త్రీ సంపర్కాన్ని కోరినప్పటికీ, ఆలోచనల్ని ఆచరణలో పెట్టే మనోధైర్యం లేదతనికి. అతని మనస్సు ఎప్పుడూ సంఘం నిర్వచించిన "నీతి", "అవినీతు"ల మధ్య—ప్రాణం జీవన్మరణాల మధ్య కొట్టుకొన్నట్లుగా కొట్టుకునేది.

అతని మనోవైరుధ్యానికంతకీ కారణం అతనికున్న జ్ఞానం అనే చెప్పాలి అతని విషయంలో. అతను డాక్టరు పరీక్షకి చదువుతున్న రోజుల్లో 'మనిషి' ని ఒక శరీరంగా చూడటం' నేర్చుకున్నాడు. "అజ్ఞాతంగా ఉంటేనే ఆకర్షణ" అని అతనికి క్రమేపీ బోధ పడింది. తరవాత అతను చికిత్సకి సంబంధించిన అనేక సందర్భాల్లో అనేకమంది స్త్రీ పురుషులను నగ్నంగా చూశాడు. అటువంటి దృశ్యాలు అతనిమీద ఎట్టి ప్రభావాన్నీ కలిగించలేదు. వెనకటి ఉద్రేకం, మనోవికారం, అన్నీ

నశించిపోయాయి. అతను పూర్తిగా భౌతికవాది అయిపోయాడు. వివాహం పట్ల విముఖత కూడా ఏర్పడింది.

అతను సంపాదన పరుడైన తరవాత తండ్రి సంసారంలో ఒడుదుడుకులు తగ్గాయి. తన సంపాదనతోనే చెల్లెళ్లిద్దరి పెళ్లిళ్ల చేశాడు. తమ్ముళ్ళకి చదువులు చెప్పిస్తున్నాడు ఏదైనా సమయం వచ్చినప్పుడు తండ్రి సరళంగా చెప్పేవాడు "నువ్వు ఒక ఇంటివాడివైతే మీ అమ్మ మనసుకి సంతృప్తి కరంగా ఉంటుంద"ని, అటువంటప్పుడు ఆ మాటలు విననట్లుగా నటించి విషయం మార్చేసేవాడు. తల్లికీ కొడుక్కీ మధ్యన మధ్య మధ్య సంవాదం జరుగుతూనే ఉండేది. అసలు ఇంట్లో తల్లిదండ్రుల కన్నా స్నేహితుల ఒత్తిడి ఎక్కువైంది.

ఎవరో ఒక పత్రికలో రాశారు "మగవాళ్ళు అన్ని సదుపాయాలూ ఉండికూడా, మనసులో ఏవో వింత అభిప్రాయాలూ, ఆదర్శాలూ పెట్టుకుని, అస్ఖలిత బ్రహ్మచారుల్లా జీవితాలు గడపదలుచుకుంటే ఆడపిల్లలకి పెళ్లిళ్ల అవమంటే ఎలా అవుతాయి? ఆడపిల్లల్ని కన్న తల్లితండ్రుల మనోవ్యాధి నయమవమంటే ఎలా అవుతుంది?' అని. రామారావు ఆ పత్రిక తీసుకొచ్చి ఆ వాక్యాలు చదవమని చూపించాడతనికి. అతను చదివి, 'పెళ్లిళ్ల చేసుకోందేమనుషులు జీవించలేరని ఆ వ్యక్తి అభిప్రాయం కాబోలు' అన్నాడు ఎంతో నిర్వికారంగా. 'పెళ్లిలేకుంటే జీవితం అసంపూర్ణం' అన్నాడా మిత్రుడు.

ఏ కళనున్నాడోగాని, రామారావు బలవంతంమీద ఎలాగైతేనేం పెళ్లిచూపులికి వెళ్లడానికి అంగీకరించాడతను. రామారావు ఎలాగో అలా అతన్ని 'పెళ్లిచూపులి'కి ఒప్పించగలిగినా, పెళ్లికి ఒప్పుకుంటాడనే ఆశ మాత్రం లేదు.

ముందు గుమ్మంలోకి ప్రవేశించగానే బొచ్చుకుక్క ఒకటి భౌ....భౌ మంది. ఆ అరుపువిని లోపలినుంచి ఒకమ్మాయి విసురుగా వచ్చి, గుమ్మంలోకనిపించిన పెద్ద మనుషుల్ని చూడగానే 'జాకీ'ని తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది దూకుడుగా, సావిడిదాకా వెళ్ళేసరికి నడి వయస్సు దాడిన ఒకాయన కనింపించాడు. వీళ్లను చూడగానే 'రండి.... రండి' అన్నాడు ఎంతో ఆప్యాయంగా, 'అనుకున్న వేళకి రాలేక పోయాం.. బయలు దేరే వేళకి ఇతని కోసం ఎవరో రోగులు వచ్చారు...ఆలస్యం అయిపోయింది' అన్నాడు రామారావు. 'ఎంత మాటన్నారు....ఆలస్యం అయితేనేం లెండి....ఏదో అన్నమాట ప్రకారం వచ్చారు...చాలా సంతోషం...రండి. ఇలా కూర్చోండి' అంటూ వాళ్ళని అక్కడున్న కుర్చీల్లో కూర్చోబెట్టి తనో కుర్చీలో కూర్చున్నాడు. ఓ రెండు మూడు నిముషాలు పోయాక 'సరోజా' అని ఎలుగెత్తి పిలిచాడు. పిలిచిన రెండు మూడు నిముషాలకి 'సరోజ' సావిట్లోకి వచ్చి అతిధులిద్దరికీ నమస్కరించింది. 'సరోజ' పేరుకి తగినట్లుగానే మనిషి పువ్వులా ఉంది సుతారంగా. తెల్లటి మైసూరు సిల్కుచీర కట్టుకుంది. ఎర్రటి ముఖ్‌మల్ జాకట్టు తొడుక్కుంది. ఒక చేతికి రిస్టువాచీ ...మరో చేతికి రెండు సన్నని బంగారపు గాజులు .. వాటిమధ్య నాలుగైదు ఎర్ర గాజులు...మెళ్లో సన్నటిగొలుసు...నుదురుమీద ముంగురులు గాలికి కొంచెం కదులుతున్నాయి—మెడమీదికి జారేలాగున సిగచుట్టుకుంది. కళ్ళజోడు పెట్టుకుంది—మనిషి మొత్తంమీద దర్జాగా ఉంది చూపులలోనూ, నడకలోనూ.

ఏవోవంకలు పెట్టి ఈ సంబంధం నుంచి తప్పించుకుందామని ముందే నిర్ణయించుకున్న అతను ఆ యువతిని చూశాక అందకత్తె కాదని అనుకోలేక పోయాడు. పైగా బి. ఏ. పాసైందని కూడా చెప్పాడు

రామారావు. తను ఏ వంక పెట్టుకుని సంబంధం కాదన గలడు? అయినా సంబంధానికి ఒప్పుకుంటే యేం?—వివాహం మానుకోవలసిన అగత్యం ఏం వుంది తనకి?—అతని మనస్సు మెల్లిగా మెత్తబడింది. ఆ అమ్మాయి అందానికి తోడు, ఆమె వాక్చాతుర్యం కూడా అతణ్ణి ఆకర్షించింది. సైన్సులో తనకెంతో అభిరుచి ఉందని చెప్పింది. మనం తీసుకునే ఆహారం మీద జనరల్‌గా కొన్ని అభిప్రాయాలు వెలిబుచ్చింది. మనం తీసుకోవల సిన ఆహారం ఎలా ఉండాలో సూచించింది. ఆవిడ అభిప్రాయాలు అతనికి ఎంతో నచ్చాయి. ఆవిడ చదువుకున్న విషయం చరిత్రకు సంబంధించిన దైనా, సైన్సులో కూడా ఆవిడకి అభిరుచి ఉందని తెలియగానే ఆవిడమీద ఒక విధమైన అభిమానం కూడా ఏర్పడిందతనికి. అంతేకాకుండా ఆమెకి సాహిత్యంలో కూడా పరిచయం ఉన్నట్లు చెప్పింది. ఆమధ్య ఒకపత్రికలో "స్వాతి" అనే పేరు పెట్టుకుని వ్రాసినది తనే నని చెప్పింది. ఆ మాటలు వినగానే రామారావు అతనికేసి చూసి భావగర్భితంగా చిరునవ్వు నవ్వాడు. ఎందుకో అతనికి చచ్చేటంత సిగ్గేసింది.

వీళ్ళు మాట్లాడుకుంటూండగావంటవాడు టీ తీసుకొచ్చాడు. 'సుధని పిలుచుకురా పంతులూ! అన్నాడా పెళ్ళికూతురు తండ్రి వంటవాడితో. వంటవాడు వెళ్ళాడు పిలవడానికి. కొన్ని క్షణాల్లో టకటక మంటూ మేడ మెట్లు దిగి రివ్వున పావురంలా వచ్చి వాలింది సుధ. శాటిన్ సిల్కు పరికిణీ, మోచేతులవరకూ జాకట్టు పల్చటి వోణి వేసుకుంది. మెళ్ళో ముత్యాలదండ. వదులుగా రెండు జడలు వేసుకుంది, 'జాకీ' సుధ పాదాల దగ్గరే అలసి పోయి చతికిలబడింది. 'ఈయనే డాక్టరు, సుధా' అన్నాడు తండ్రి. 'నేనూ అలాగే అనుకున్నాను....నమస్తే' అంది వొయ్యారంగా. అందరికీ టీ అందించింది-మధ్య మధ్య జారిపోతున్న పమిటను సర్దు కుంటున్నట్లు నటిస్తూ. 'పాపం, ఇంకా ఈ అమ్మాయికి చంటిపిల్లజబ్బు పోలేదు' అనుకున్నాడు డాక్టరు.

సుధ వచ్చిన తరవాత వాతావరణం. మారింది. అందరినీ తన కబుర్లతో నవ్వించింది. తన ముద్దుల 'జాకీ' చేసే చిలిపి చేష్టల్ని వర్ణించింది. ఒకసారి దాన్ని కాలేజికి తీసికెడితే అది చేసిన అల్లరి అంతా పూసగుచ్చినట్లు చెప్పి, వాళ్ళు నవ్వుతూంటే తనూ కిలకిల నవ్వుతూ జాకీని ఎత్తుకుని ముద్దులు పెట్టుకుంది. వాళ్ళు వెళ్లేటప్పుడు జాకీ చేత 'టా టా' అంటున్నట్లుగా కాలు ఊపించింది. అతనూ, రామారావూ నవ్వు కుంటూనే బయటికి వచ్చారు.

వీధ గుమ్మందాటి రోడ్డు మీదికి రాగానే రామారావు ఉద్రేకం పట్టలేక అడిగాడు 'ఆ అమ్మాయి నీకు నచ్చిందా?' అని. 'నచ్చిందోయ్, మొత్తంమీద నన్ను వలవేసి పట్టేశావు' అన్నాడు మందహాసంతో అతను. రామారావు ఆనందానికి మేరలేదు. విజయ గర్వంతో అభినందించాడు రామారావు. కొంతదూరం మౌనంగా నడిచారిద్దరూ.

'రామం' అన్నాడు చిరునవ్వుతో అతను.

'ఏం' అన్నాడు రామారావు ధైర్యంగా,

'అన్నీ బాగానే ఉన్నాయి గానీ, ఆ అమ్మాయి కళ్లజోడు ఫేషన్‌కి పెట్టుకుందా, లేక నిజంగా కళ్ళజబ్బు ఉండీ పెట్టుకుందా?' అని తన సందేహం వెలిబుచ్చాడు డాక్టరు. ఆ ప్రశ్న వినిరామారావు ఒక్కక్షణం పాటు కొయ్యబారిపోయాడు. అతను తెల్లబోయాడు రామారావు వాలకం చూసి. రామారావు తేరుకుని చిన్న బుచ్చుకున్న ముఖంతో, 'నువ్వను కున్నావిడ పెళ్లికూతురు తల్లి' అన్నాడు.

తనే శీర్షాసనం వేసుకుని ప్రపంచాన్ని చూస్తున్నాడో, ప్రపంచమే శీర్షాసనం వేసిందో అతనికి అర్థంకాక అలా శూన్యంలోకి చూశాడు.

(తెలుగుదేశం, 1-10-54)